క్లుప్తంగా

ఉచిత శిక్షణ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఎస్. సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జనరల్ సెక్రటరీ డా. చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్లౌజ్ డిజైన్, జ్యూట్ బ్యాగ్ తయారీ, మగ్గం వర్కు, ఎంఎస్ ఆఫీస్, బ్యూటిషియన్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నారు. ఈనెల 2 నుంచి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4.30గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నీటి సరఫరా సమయాన్ని పెంచాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ తులసీనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. మంజీరా నీటి సరఫరా సమయాన్ని పెంచాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె అధికారులతో మాట్లాడి సమస్య వివరించి వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో కొండల రెడ్డి, బంగారు, సాంబయ్య, బైరెడ్డి, రవీందర్ రెడ్డి, యోగిరాజు, సత్తమ్మ పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటిషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందజేస్తున్నారు. మహిళలు మొదట అడిషన్ కోసం రూ.150లు చెల్లించాలి. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15ఏళ్ల వయస్సు నుంచి 35 ఏళ్ల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు.

నేడు ఆర్ట్‌గ్యాలరీలో 'కంటి వెలుగు'

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కావాల్సిన కళ్లజోడులను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

సీనియర్ సిటిజన్స్‌కు ఆట విడుపు అవసరం

గచ్చిబౌలి: సీనియర్ సిటిజన్స్‌కు ఆట విడుపు అవసరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. యోగా క్షేమాలు మాట్లాడుకోవడం, చెస్, క్యారమ్ లాంటి ఆటలు ఆడుకునేందుకు వేదికగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చాంద్ పాషా, జంగం గౌడ్, రాజేష్, సీనియర్ సిటిజన్లు నాగేశ్వర్ రావు, నర్సింహులు, బాలకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పరామర్శ



నసీర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సీనియర్ నాయకుడు ఎండీ నసీర్ భార్య అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి నసీర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టైలర్స్ డే



టైలర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ 3వ ఫేజులో జరిగిన టైలర్స్ డే వేడుకల్లో మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్జీల సమస్యలు తీర్చడానికి తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సాయిబాబా చౌదరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



ఫతేనగర్‌లోని శ్రీకృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో జరిగిన సైన్స్ డే వేడుకల్లో కార్పొరేటర్ సతీష్‌గౌడ్



మూసాపేటలోని పంచశీల పాఠశాలలో నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ఇంటర్ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో నమూనాలను తిలకిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి



రాజధాని హైస్కూల్‌లో నేషనల్ మెగా ఆర్ట్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బీజేపీ నేత గజ్జల యోగానంద్



వివేకానందనగర్‌లోని శ్రీ చైతన్యలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



సర్దార్ పటేల్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో నమూనాలను తిలకిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు



నమూనాలను తిలకిస్తున్న కేంద్రీయ విద్యాలయం పీజీటీ డా. వీఎస్. నిషాకరాచారి, జోనల్ డీన్ శంకర్రావు



సైన్స్ డే

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో మంగళవారం జాతీయ సైన్స్ డే వేడుకలు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా జరిగాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యాసంస్థల్లో సైన్స్ ఫెయిర్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఉపాధ్యాయులు తిలకించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ... భారతరత్న అందుకున్న తొలి విజ్ఞాన కెరటం సర్ సీవీ రామన్ అని అన్నారు. రామన్ ఎఫెక్ట్‌పై చేసిన పరిశోధనలకు ఆయన నోబుల్ ప్రైజ్ వచ్చిందన్నారు. విజ్ఞాన ఆవిష్కరణలో భారతీయులకు నోబుల్ రావటం గగనమని.. అటువంటి నోబుల్‌ను సర్ సీవీ రామన్ అందుకోవడం గొప్ప విషయమన్నారు. – కూకట్‌పల్లి

నూతన వేతన సవరణను అమలు చేయాలి



నూతన వేతనాలు అమలు చేయాలని నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

కేపీహెచ్‌బీకాలనీ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీ జేఏసీ పిలుపు మేరకు నూతన వేతనాల జాప్యాన్ని నిరసిస్తూ టీఎస్‌పీఈ జాక్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జాక్ నాయకులు మాట్లాడుతూ... మార్చి 1, 2 తేదీల్లో డివిజన్ ఆఫీస్, జనరేటింగ్ స్టేషన్‌ల వద్ద, మార్చి 3, 4, తేదీల్లో సర్కిల్ కార్యాలయం, కార్పొరేట్, జనరేటింగ్ స్టేషన్‌ల వద్ద భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలో ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీలో ఎలక్ట్రిసిటీ కార్యాలయంలో సుమారు 150 మంది ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీ రామ్మోహన్, హెచ్. శ్యాంసుందర్, జి. శ్యాంప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ సెక్షన్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కూకట్‌పల్లి: విద్యుత్ వేతన సవరణ.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బాలాజీనగర్ సెక్షన్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ సెక్షన్ ఏఈ శంకర్, ఫోర్‌మెన్ కె. వెంకటేశ్వర్లు, సబ్‌ఇంజినీర్ సంతోష్, లైన్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, లైన్‌మెన్ రాజేందర్, రమణ, జూనియర్ లైన్‌మెన్‌లు యాదయ్య, సంతోష్, మాణిక్య రెడ్డి, పీతాంబరం, శ్రీనివాస్, చౌహాన్‌రాజు, రాఘవేందర్, పోలయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవసరం ఉన్న చోట పనులు పూర్తి చేస్తున్నాం



రాంనరేష్‌నగర్ కాలనీలో పనుల పరిశీలకు వచ్చిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్‌నగర్ కాలనీ, హైదర్‌నగర్ చెరువు వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఇంజినీరింగ్, ఇరిగేషన్ అధికారులతో మంగళవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంనరేష్‌నగర్ కాలనీలో డ్రైనేజీ లైన్ మార్చాలని స్థానికులు కోరడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించానన్నారు. తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలీ తలాబ్ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించారు.

- ఆదేవిధంగా శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డివిజన్‌లో అవసరం ఉన్న చోట మొదటి ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్‌వైజర్ నరేంద్ర, వాటర్‌లైన్ ఈశ్వర్, ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎస్ఎఫ్ఐ శ్రీకాంత్, ఇరిగేషన్ ఏఈ విశ్వం, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లాలి

బూత్ కమిటీ సమావేశంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు తెలిసేలా బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కోరారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లో ఉన్న 65 బూత్ కమిటీల సభ్యులు తమ వంతు పాత్ర పోషించి ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాలని చెప్పారు. 10 బూత్ కమిటీలకు ఒక అధ్యక్షుడితో పాటు 5 మంది సభ్యులను నియమిస్తామన్నారు. బూత్ కమిటీల పని తీరు అధ్యక్షుడితో పాటు మిగతా ఐదుగురు చూసుకోవాలని సూచించారు.

ఈనెల 3న బూత్ కమిటీ సభ్యులతో సమావేశం...

మార్చి 3వ తేదీ శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మల్లికార్జునగర్‌లోని భాగ్యశ్రీ గార్డెన్‌లో సుమారుగా 7040 మంది బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నామని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై బూత్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. బూత్ కమిటీ సభ్యులు ఈ సమావేశానికి తప్పకుండా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షకార్యదర్శి ఇర్ఫాన్, మేకల హరినాథ్, నాయకులు సయ్యద్ ఏజాజ్, కర్రె జంగయ్య, వాసుయాదవ్, జహంగీర్, బుర్రి యాదగిరి, కనకదాస్, కర్రె లావణ్య, లలితా, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలి

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో దోమల బెడదపై మంగళవారం ఎంటమాలజీ ఏఈ నగేష్, ఈఎఫ్ఏ సిబ్బందితో కార్పొరేటర్ మహేందర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫాగింగ్ చేసినా దోమలు బెడద తగ్గటం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇకపై దోమల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. నిత్యం ఫాగింగ్ చేసి దోమల బెడదను తగ్గించాలని సూచించారు. రోజు విడిచి రోజు ఫాగింగ్ తప్పకుండా చేయాలన్నారు.

'సుందరీకరణ పేరుతో చెరువులను కబ్జా చేస్తున్నారు'



స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్



ఎన్‌టీఆర్‌నగర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్‌నగర్ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. భిక్షపతియాదవ్ హయాంలో ఎల్లమ్మబండ, ఎన్‌టీఆర్‌నగర్, మహంకాళి నగర్‌లో చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు సుందరీకరణ పేరుతో చెరువులను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఎవరైనా బిల్డింగ్‌లు కట్టుకుంటుంటే డబ్బులు వసూలు చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇప్పటి వరకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అర్హులైన లబ్ధిదారులకు ఇచ్చారా అన్ని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, కేజీ టు పీజీ ఉచిత విద్య, జిల్లాకో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, బీసీ, ఎస్సీ, గిరిజనులకు రిజర్వేషన్లు వంటి ఎటువంటి హామీ నెరవేర్చని ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కార్యకర్త బూత్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ అవినీతిని తెలియజేయాలని సూచించారు.

క్యాండిల్ ర్యాలీ...

అనంతరం మెడికో ప్రీతినాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని క్యాండిల్ ర్యాలీ నిర్వహించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో రామరాజు, విజిత్, నరేందర్‌రెడ్డి, కుమార్‌యాదవ్, మణిభూషన్, కమలాకర్‌రెడ్డి, నర్సింగ్‌యాదవ్, చారి, అనిత, కల్పన, రామ్‌మోహన్, సీతారామరాజు, శ్రీహరి యాదవ్, శివాజీ, రాజు, శ్రీకాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కళావిహీనంగా హెచ్ఏఎల్ పార్కు

- నిర్వహణ లేక పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పార్కును అభివృద్ధి చేయాలంటున్న కాలనీవాసులు





పార్కులో కనబడని పచ్చదనం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హెచ్ఏఎల్ కాలనీ పార్కు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పార్కులో కనీసం పచ్చదనం ఉసే లేకుండా పోయింది. పార్కు గేట్ ముందు వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. దాని పక్కనే దుకాణాలు ఉన్నాయి. వాటి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పార్కులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పార్కులో పిల్లల ఆట వస్తువులు సరిగా లేవు. పార్కు లోపల చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధంగా మారింది. పార్కు నిర్వహణ గాలికొదిలేయడంతో పార్కు కళావిహీనంగా కనిపిస్తోంది.

- 1974లో హుడా లేఅవుట్ ప్రకారం హెచ్ఏఎల్ కాలనీ ఏర్పడినప్పుడు 3708 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. 2002లో కూకట్‌పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పార్కు అభివృద్ధికి బీజం పడింది. పార్కు చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. అప్పటి నుంచి అలాగే ఉన్న పార్కులో గతేడాది ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దీంతో పార్కుకు కళ వచ్చింది. ప్రస్తుతం పార్కులో పచ్చదనం లేక పార్కు కళ కోల్పోతోంది.
- ఈ పార్కులో ముఖ్యంగా వాకింగ్ ట్రాక్, ట్రాక్ పక్కన పూల మొక్కల ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పచ్చదనం కొరవడకుండా పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ చొరవ చూపాలని కాలనీవాసులు విన్నవిస్తున్నారు.
- పార్కును మరింత అభివృద్ధి పరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పార్కులో ఉన్న కమ్యూనిటీహాల్‌లో ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పార్కు నిర్వహణ బాధ్యత ఒక్కడి పైనే పడటంతో అన్ని పనులు చేయలేకపోతున్నాడని పేర్కొంటున్నారు.
- పార్కు పరిశుభ్రంగా ఉండేలా పనివాళ్లు, వాచ్‌మెన్‌ను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్కులోకి వస్తున్న వారు భోజనాలతో పాటు చిరుతిళ్లు తిని ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. వాటి శుభ్రతకు చర్యలు చేపట్టడంతో పా టు రోజువారీగా చెత్తను పార్కు నుంచి తొలగించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టాలి

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి బీజేపీ కార్యకర్తలు, నాయకులను కోరారు. 'ప్రజా గోస–బీజేపీ భరోసా' పేరిట స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజల ముందుకు తెచ్చేందుకే బీజేపీ 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారు లబ్ధిపొందేలా చూడాలన్నారు.

రాష్ట్రంలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు..

రాష్ట్రంలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ధీమా వ్యక్తం చేశారు. రాయదుర్గంలో శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి గజ్జల యెగానంద్, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పుడు రాష్ట్రంలో ఎన్నికల వచ్చినా బీజేపీ గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో కూడా బీజేపీ జెండా ఎగురవేయాలని, నాయకులు, కార్యకర్తలంతా విభేదాలు పక్కన పెట్టి సమష్టిగా కృషి చేయాలని కోరారు.